ఆకట్టుకునే వ్యక్తిత్వం అవసరం — నారంశెట్టి ఉమామహేశ్వరరావు

పిల్లలూ! ఈ రోజు మనమొక కొత్త విషయం తెలుసుకుందాం. "సంపాదన కోసం ఒంటిపై దుస్తులు మాసినా పర్వాలేదు కానీ వ్యక్తిత్వం మలినం కాకూడదు" అన్న మాట ఎప్పుడైనా విన్నారా? చదివారా? ఇంతకీ వ్యక్తిత్వం అంటే ఏమిటనే సందేహం కలిగిందా? ఆ విషయమే ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

కేంబ్రిడ్జి అంతర్జాతీయ ఆంగ్ల నిఘంటువు "నడవడిక, ఆలోచనా సరళి, భావాలను అభివ్యక్తం చేసేదే వ్యక్తిత్వం" అని వివరించింది. సమకాలీన లాంగ్ మన్ ఆంగ్ల నిఘంటువు "ఒక వ్యక్తి యొక్క సమగ్ర స్వభావం లేక నడవడికయే వ్యక్తిత్వం" అని చెప్పింది. వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడమనేది పెద్ద పదంలా అనిపించవచ్చు. కానీ నిజానికిది మన మేలు కోరేది. ఇటుకలతో ఇల్లు కట్టినట్లుగానే, మంచి అలవాట్లు, మేటి ఆలోచనలు, ఉత్తమ ప్రవర్తనతో మనం వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవచ్చు.

వ్యక్తిత్వం అంటే బయటి ప్రపంచానికి మనం కనిపించే విధానం, ఇతరులతో ప్రవర్తించే విధానం, కష్టాలు, సమస్యలు ఎదురైనప్పుడు ఎదుర్కొనే విధానం, నిర్ణయాలు తీసుకునే పద్ధతి, ఇష్టాయిష్టాలు మొదలైనవన్నీ కలిపితే ఏర్పడుతుంది. అందమైన దుస్తులు వేసుకోవడం, బాగా మాట్లాడటం వల్ల మాత్రమే వ్యక్తిత్వం రాదు. లోపల ఉండే నిజమైన మనసు, గుణం మాత్రమే వ్యక్తి యొక్క నిజమైన వ్యక్తిత్వం.

మానవ జీవితంలో అనేకమైన విలువలు, లక్ష్యాలు ఉంటాయి. చదువు, ధనం, సౌకర్యాలు అవసరమే. కానీ వీటికంటే ఎక్కువగా మనిషిని నిలబెట్టేది, గుర్తింపు తెచ్చేది వ్యక్తిత్వం. అందుకే "వ్యక్తిత్వం అనేది మనిషి యొక్క నిజమైన సంపద" అని మహనీయులు చెప్పారు.

ఒక వ్యక్తి ఒంటరిగా ఉన్నా, గుంపులో ఉన్నా, మంచి పద్ధతిలో ప్రవర్తిస్తే అతను ఉన్నత వ్యక్తిత్వం గలవాడని చెప్పవచ్చు. ఎదురుగా ఎవరో ఉన్నప్పుడు మంచి ప్రవర్తన చూపడం, లేనప్పుడు నచ్చినట్టు ప్రవర్తించడం సరైనది కాదు. అన్ని సమయాల్లో నిజాయితీగా ఉండడం, ఇతరుల పట్ల దయ కనబరచడం వంటివన్నీ నిజమైన వ్యక్తిత్వానికి గుర్తులు.

మానసిక శాస్త్రవేత్తల విశ్లేషణ పరిశీలిస్తే ఒక వ్యక్తి ప్రవర్తన , ఆలోచన, పెరిగిన వాతావరణం, వంశపారంపర్య సంక్రమణ బట్టి వ్యక్తిత్వం నిర్మాణం అయి ఉంటుందని తెలిసింది. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వం జెనిటిక్ గా వంశపారంపర్యంగా సంక్రమించటమనేది ఉన్నప్పటికీ దానికి ఎన్నో రెట్లు అతని పరిసరాలు, అనుభవాలు, సాంఘిక వ్యక్తిత్వ వికాసంలో ఎంతో ప్రభావాన్ని కలిగిస్తాయి.

ఉదాహరణకు అగ్ని నెయ్యిని కరిగిపోయేలా చేస్తుంది. కానీ అదే అగ్ని, కోడి గుడ్డుని గట్టి పరుస్తుంది. ఆ విధంగా కొన్ని పరిస్థితులు మనిషిని హంతకుడిగా మారిస్తే, అవే పరిస్థితులు అహింసా మూర్తిగా మార్చుతాయి. మహాత్మా గాంధీ, మదర్ థెరీసా లాంటి వారిని తయారు చేస్తాయి. పరిస్థితుల్ని బట్టి స్పందించడం ఆ వ్యక్తి ఆలోచనలు , అతనికి అబ్బిన సంస్కారాన్ని బట్టి ఉంటుంది. పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి అన్ని రంగాల్లో సుఖంగా , శాంతిగా , ఇతరుల పట్ల దయతో జీవిస్తాడు.

ఒక వ్యక్తి గులాబీ తోటలో రంగురంగుల గులాబీ సౌందర్యాన్ని చూసి ఆనందించవచ్చు . మరొకరు వాటినే కోపంతో కసికసిగా చిందరవందరగా చించి పారేయవచ్చు. అదతని వ్యక్తిత్వానికి ప్రతిరూపం. బహిర్గతమైన అంతర్గత రూపం.

లోకంలో విభిన్నమైన వ్యక్తులు, విభిన్న వ్యక్తిత్వాలున్న వారుంటారు. అందుకు బాల్యంలో పిల్లల మనసుల మీద తల్లిదండ్రుల ప్రవర్తన, కుటుంబ వాతావరణం చూపిన ప్రభావం కారణం. తల్లిదండ్రుల

అనుబంధం , ఆప్యాయతలు మొదలైనవి వ్యక్తిత్వ వారి వికాసాన్ని ప్రభావితం చేస్తాయి. తల్లిదండ్రుల గొడవలు, కుటుంబ కలహాలు పిల్లల వ్యక్తిత్వ వికాసానికి విఘాతం కలిగిస్తాయి.

ఈ అంశం మీద ఒక కథ చదువుదాం. అమెరికాలో ఇద్దరు అబ్బాయిలు ఉండేవారు. ఒక పిల్లాడు పుట్టక ముందే తండ్రి చనిపోయాడు. తల్లి రెండో పెళ్లి చేసుకుంది. కొన్నాళ్ల తర్వాత అతనికి విడాకులు ఇచ్చింది. తర్వాత కూడా రాత్రి వేళల్లో మగ స్నేహితులని ఇంటికి తీసుకు వచ్చేది. పిల్లాడి ముందే వారితో తాగుతూ ప్రవర్తించేది . ఇలాంటి విష వాతావరణంలో పెరిగిన ఆ పిల్లాడు తల్లితో బాటు ఇంట్లో ఉండలేకపోయాడు. కమ్యూనిజం మీద ఆకర్షితుడై రష్యా దేశం వెళ్ళాడు. అక్కడా సరిగ్గా ప్రవర్తించలేదు. ఒక రక్షక భటుడిని తుపాకీతో కాల్చాడు. చేసిన నేరానికి అక్కడి ప్రభుత్వం శిక్షించడమే కాకుండా శిక్షాకాలం పూర్తయ్యాక సొంత దేశం పంపించేసింది. ఇలాంటి మానసిక వైపరీత్యాలకు గురయిన అతను 23వ ఏట అప్పటి అమెరికా ప్రెసిడెంట్ జాన్ కెనడీ ని హత్య చేశాడు. అతన్ని రక్షక భటులు కాల్చేశారు. అతడి పేరు లీ హార్వే ఓస్వాల్డ్ .

మరొక పిల్లాడు చిన్నప్పటి నుంచి తెలివైనవాడు . తండ్రి చిన్నతనంలోనే చనిపోయాడు. పైగా పిల్లాడికి పోలియో. రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. అయితే ఏం ? తల్లి ఆ పిల్లాడిని అమితంగా ప్రేమించేది. ఎంతో శ్రద్ధగా పెంచి పెద్ద చేసింది. అన్ని విషయాల్లో కొడుక్కి వెన్నుదన్నుగా నిలబడింది. అతడు కాలేజీకి వెళ్లే సమయానికి వూళ్ళో సరైన కళాశాల లేదని, వూళ్ళో ఉన్న విశాలమైన భవనాన్ని వదిలేసి పిల్లాడితో పాటుగా పట్నం వచ్చింది . కొడుకుతో కలసి ఒకే గదిలో ఉండి చదివించింది . తల్లి ఇచ్చిన మానసిక ధైర్యంతో అతడు గొప్పవాడుగా ఎదిగి , అమెరికా అధ్యక్షుడు అయ్యాడు. అతని పేరు ఫ్రాంక్లిన్ రూజ్ వెల్ట్.

తల్లి పెంపకం సరిగ్గా లేకపోవడంతో ఒకడు ఆ దేశ అధ్యక్షుడిని చంపేటంత నేరం చేయగా, సరైన పెంపకం తోడవ్వడంతో మరొకడు అమెరికా అధ్యక్షుడు అయ్యాడు. పిల్లలపై పెద్దల ప్రభావం ఉంటుందని చెప్పడానికి వీళ్లే చక్కని ఉదాహరణ. పిల్లల వ్యక్తిత్వం చక్కగా రూపుదిద్దుకొని గొప్పవారిగా మారతారా లేదంటే ప్రపంచానికి శత్రువైన బిన్ లాడెన్ అవుతారా అనేది మాత్రం యాభై శాతం తల్లిదండ్రుల పెంపకం మీద ఆధారపడి ఉంటుంది. పిల్లలతో తల్లిదండ్రులు గడిపే విధానం , వారిపై చూపే ప్రేమ , పెద్దల ప్రవర్తన, సమయపాలన, క్రమశిక్షణ వంటివన్నీ దగ్గర నుండి చూసి అనుకరిస్తూ , అనుసరిస్తూ పెరుగుతారు పిల్లలు. అది వారి వ్యక్తిత్వంపై ప్రభావం చూపిస్తుంది.

దీనికితోడు పాఠశాలలో గురువుల ప్రభావం విద్యార్థుల మీద ఉంటుంది. అందరినీ ఆకట్టుకొని అవసరమైన రీతిలో మలచే శక్తి ఉపాధ్యాయుడికి ఉండాలి. అదేవిధంగా కుటుంబ వాతావరణం ప్రోత్సాహకరంగా ఉండాలి. ఇటువంటి వాతావరణం నుంచి సొంతంగా మంచి - చెడు ఆలోచించే శక్తి అలవడుతుంది. కొందరు తమలో కలిగే స్పందనలకి ఆలోచనలకి మరింత స్పందిస్తుంటారు. వాటిని గుర్తించి అధ్యాపకుడు ప్రోత్సహిస్తే వారి వ్యక్తిత్వం మరింత మంచిగా వికసిస్తుంది.

యువతగా ఉన్నప్పుడు ఎన్నో ఆలోచనలు ఉద్దేశాలు వారిలో కలుగుతాయి . పెరిగిన వాతావరణం, పొందిన శిక్షణను బట్టి కొందరు చక్కగా తమ వ్యక్తిత్వాన్ని రూపు దిద్దుకుంటారు . అలాంటి శిక్షణ లేని వారు దారం తెగిన గాలిపటంలా ఇష్టానికి విహరిస్తారు. వ్యక్తిత్వ వికాసంలో కుటుంబం, సమాజం ప్రముఖ పాత్ర వహించినా వ్యక్తిగా వాటన్నింటినీ అధిగమించి, స్వయంగా ఆలోచించి, తన ఆలోచనలెలా ఉండాలో, తన ప్రవర్తనెలా ఉండాలో , సమాజ అభివృద్ధిలో తన వంతు పాత్ర ఏమిటోనని నిర్ధారించుకొని వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకుంటారు మరికొందరు. బురదలో నుండే కమలం వికసించినట్లు, కలుషిత వాతావరణం నుంచి నలుగురిని ప్రభావితం చేసే వ్యక్తిత్వ వికాసంతో కొందరు తయారవుతారు .

అయితే మనం చెప్పుకున్న మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడమెలాగో తెలుసుకుందాం. ఒక మంచి ఇంటిని నిర్మించడానికి పునాది ఎంత ముఖ్యమో, మంచి వ్యక్తిత్వాని బలమైన పునాదులు అవసరం. మనుషుల ప్రవర్తన ఎలా ఉంటే లోకంలో మర్యాద కలుగుతుందో భర్తృహరి రాసిన ఒక పద్యం చక్కగా వివరించింది.

పరకృప భృత్యు లందు నిజసర్గమునం దనుకూల వృత్తి కా/

పురుషుల యందు శాఠ్యము సుబుద్ధుల యందనురక్తి దాల్మి స/

ద్గురువుల యందు శౌర్యము మృగాక్షుల యందుఁ బ్రగల్భ భావమీ /

వరుసఁ గళా ప్రవీణులగు వారల యందు వసించు లోకముల్ !

ఎవరైతే బంధువుల పట్ల దాక్షిణ్యము, సేవకుల యందు దయ, చెడ్డ వారి పట్ల కాఠిన్యం, మంచి వారి యందు అభిమానం, రాజు పట్ల విధేయత, విద్వాంసుల పట్ల గౌరవం, శత్రువులపై బలపరాక్రమం, పెద్దల యెడ ఓర్పు, స్త్రీల పట్ల దిట్టతనం ప్రదర్శిస్తారో అలాంటి వారి వల్ల లోకమర్యాద కలుగుతుందని భావం. ఎలాంటి వ్యక్తిత్వం కలిగి ఉండాలో భర్తృహరి వివరించినప్పటికీ ఇప్పటి కాలానికనుగుణంగా ఎలాంటి లక్షణాలు అలవరచుకుంటే చక్కని వ్యక్తిత్వం కలుగుతుందో తెలుసుకుందాం.

'A sound mind in a sound body' అని చెప్పినట్టు ప్రతి ఒక్కరూ శారీరక ఆరోగ్యం కాపాడుకోవాలి. ఆరోగ్యంగా ఉన్నప్పుడే చురుకైన శక్తితో చక్కగా ఆలోచించగలరు. శక్తిని పెంచుకోవడం, బలాన్ని కొనసాగించడానికి తగినంత శారీరక వ్యాయామం చేయాలి. సంపూర్ణ ఆహారం తీసుకోవాలి. మంచి జీవనశైలి పాటించాలి.

క్రమశిక్షణ పాటించడం అలవాటు చేసుకోవాలి. క్రమశిక్షణ బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా తయారు చేస్తుంది. అనుకున్న లక్ష్యాలను సాధించడంలో సహాయపడుతుంది. పనులను ఒక పద్ధతి ప్రకారం చేయడం ముఖ్యం. సమయానికి నిద్రలేవడం , ఎప్పటి పనుల్ని అప్పుడే పూర్తి చేయడం, దుస్తులు, ఆహారం, నివాసం మొదలైన వాటి విషయంలో శుభ్రత పాటించడం, చిన్న పనైనా నిర్లక్ష్యం చేయకుండా క్రమబద్ధంగా పూర్తి చేయడం అలవాటు చేసుకోవాలి .

సత్యం మరియు నిజాయితీలను పాటించాలి. నిజాయితీ అనేది వ్యక్తిత్వానికి పునాది. ఎప్పుడూ నిజం మాట్లాడాలి. తప్పు చేస్తే ఒప్పుకోవాలి. అబద్ధం చెప్పడం తేలికగా అనిపించవచ్చు, కానీ అది మనుషులపై నమ్మకాన్ని పోగొడుతుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు నమ్మాలంటే నిజాయితీగా ఉండాలి. సత్యమే చెబుతూ , నిజాయితీగా ఉంటే ఎవరికీ భయపడకుండా బలంగా నిలబడవచ్చు. సత్యం గొప్పతనాన్ని చెప్పే ఒక పద్యం చదువుదాం.

మాటకు బ్రాణము సత్యము/

కోటకు బ్రాణంబు సుభట కోటి ధరిత్రిన్ /

బోటికి బ్రాణము మానము /

చీటికీ బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ! అన్నారు సుమతి శతక కారుడు.

ఏదైనా ముఖ్య విషయం వ్రాసిన చీటికి సంతకం ముఖ్యం. రాజులు నివసించే కోట యొక్క రక్షణకు సుశిక్షుతులైన భటులు ముఖ్యం. గౌరవనీయమైన స్త్రీకి శీలం ముఖ్యం. మానవులు మాట్లాడే మాటలకు సత్యం అంతే ముఖ్యమని భావం. ధర్మ పాలనకు ఎంత ప్రాముఖ్యం ఉందో సత్యం మాట్లాడటానికి అంతే

ప్రాధాన్యత ఉంది.   మాటలో మంచితనాన్ని ప్రకటించాలి.  అమంగళకరమైన మాటలు కూడా మంగళప్రదంగా చెప్పాలి.

'ఒక చిన్న చిరునవ్వు, ఒక మంచి మాట, ఒక చిన్న సహాయం వంటివి గొప్ప మనుషులుగా మారుస్తాయి' అని పెద్దలు చెప్పినట్టు ఎదుటివారి పట్ల  దయ చూపుతూ, గౌరవంగా ఉండటం అలవరచుకోవాలి. చుట్టూ ఉన్న వారిని గౌరవించాలి.  పెద్దలను, చిన్న వాళ్ళను, స్నేహితుల్ని  గౌరవించాలి. ఎవరినీ కించపరచకూడదు, బాధ పెట్టకూడదు. ఎవరికైనా సహాయం కావాలంటే వెంటనే  చేయాలి.

శ్రమించడం, కృషి చేయడం వంట పట్టించుకోవాలి. విజయం అంత త్వరగా ఎవరినీ వరించదు. గట్టి కృషి చేయాలి. బాగా చదవాలి, కొత్త విషయాలు నేర్చుకోవాలి. ఏ పని చేసినా మనసు పెట్టి చేయాలి. ఆటలైనా, చదువైనా, డ్రాయింగ్ అయినా, ఏదైనా సరే శ్రద్ధగా చేస్తే అందులో  మెరుగవుతారు. శ్రమిస్తే  అనుకున్నవి సాధించగలరు.

ధైర్యంగా ఉండటం  నేర్చుకోవాలి. భయపడే సందర్భాలు ఎదురైనా తమ మీద నమ్మకాన్ని కోల్పోకూడదు. జనం ముందు లేదా  వేదికల మీద మాట్లాడడానికి భయపడినా, తప్పు జరిగినప్పుడు ఒప్పుకోవడానికి భయపడినా అక్కడే ఆగిపోతారు.  ధైర్యంగా ముందుకు అడుగేయాలి.  ధైర్యమే  వ్యక్తుల్ని బలంగా నిలబెడుతుంది.

"సహాయం చేసిన చేతి విలువ ఎప్పటికీ తగ్గదు" అని ఒక సామెత . మనుషులందరూ సహాయ గుణం కలిగి ఉండాలి. తమకి  తెలిసింది స్నేహితులకు చెప్పడం, సహచరులకు పాఠాలు బోధించడం, కష్టాల్లో ఉన్న వారికి తోడ్పడటం వంటి వన్నీ  వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి.

స్వీయ నియంత్రణ అలవరచుకోవాలి.  కోపం, అసూయ, దురాశ వంటి చెడు భావాలు మనిషిని కిందకు లాగుతాయి. వాటిని నియంత్రించగలిగిన వాడే నిజమైన బలవంతుడు. వ్యక్తిత్వం నిర్మించుకోవడంలో ఇది చాలా కీలకం.

కథలు, నైతిక బోధలు, మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకుంటూ  ప్రేరణ పొందాలి. ఆ మహనీయులు ఎలాంటి కష్టాలను ఎదుర్కొన్నారో ,  ఏయే గొప్ప  విలువల్ని కాపాడి గొప్పవారయ్యారో తెలుసుకుంటే  అలాంటి లక్షణాలు పెంచుకునేందుకు దోహదపడతాయి.

"ఎలాంటి స్నేహితులు ఉంటే అలాంటి అలవాట్లు వస్తాయనే"  మాట వినే వుంటారు. మంచి స్నేహితులుంటే మంచి గుణాలు వస్తాయి. చెడు స్నేహితులు ఉంటే తప్పు దారిలో వెళ్లే ప్రమాదం ఉంటుంది. కాబట్టి స్నేహితులను జాగ్రత్తగా ఎంచుకోవాలి. మంచి స్నేహం చేయడం వల్ల కలిగే  ప్రయోజనాన్ని  వివరించే భర్తృహరి  పద్యం  చదువుదాం.

సత్య సూక్తి ఘటించు ధీ  జడిమ మాన్చు /

గౌరవ మొసంగు జనులకుఁ గలుషమడఁచుఁ/

గీర్తిఁ  బ్రకటించు చిత్త విస్ఫూర్తిఁ జేయు/

సాధు సంగంబు సకలార్థ సాధనంబు/

సజ్జనుల స్నేహంతో బుద్ధి మాంద్యం తొలగుతుంది. అలాంటి వారి స్నేహం చేత సత్యమే పలుకుతారు. పాపాలను నశింప చేసి, మనస్సును శుభ్రపరచి మంచి గౌరవం ఇస్తుంది. నాలుగు దిక్కులలో కీర్తిని వ్యాపింప చేస్తుంది. మంచి వారి స్నేహం వల్ల లభించే మంచిని మించినది ఏ లోకంలోనూ లేదు అని భావం .

అలాగే చెడ్డవారితో స్నేహం కలిగించే నష్టం వివరించే ఇంకో పద్యం చదువుదాం.

పాలను గలిసిన జలమును/

పాల విధంబుననె యుండు బరికింపంగా /

బాల చవి జెరచు గావున/

బాలసుడగు వాని పొందు వలదుర సుమతీ!

అన్నాడు సుమతీ శతక కర్త. పాలలో కలిసిన నీళ్లు కూడా చూడడానికి పాల లాగానే ఉంటాయి. కానీ అవి కలిసి నందు వల్ల పాల రుచి తగ్గి పోతుంది. కనుక చెడ్డవాడు , మూర్ఖుడు అయిన వాడితో స్నేహం చేస్తే, వాడూ మంచివాడి లాగానే, వివేకి లాగా కనిపిస్తూ ఉంటాడు. కానీ మంచివాడి వివేకాన్ని కూడా పోగొడతాడు. కాబట్టి చెడ్డవారితో సాంగత్యం పనికిరాదని పద్య కవి తెలిపారు.

పైన చెప్పుకున్న లక్షణాలు మనసులో బలంగా నాటుకుంటే వ్యక్తిత్వం మరింత వెలుగుతుంది. ఎక్కడైనా , ఎప్పుడైనా వ్యక్తుల్ని బట్టి సమాజం తీరు ఉంటుంది. అందుకే మంచి ఆలోచనలకు, మంచి అలవాట్లకు మారాలి వ్యక్తులు. అప్పుడు సమాజం ఖచ్చితంగా బాగుంటుంది.

" ఇతరుల బోధనల ద్వారా కంటే తమ కష్టాల ద్వారానే వ్యక్తులు ఎక్కువ నేర్చుకుంటారని" పెద్దలు చెప్పినట్టుగానే శ్రమించి , వరుస ప్రయత్నాలతో విజయం సాధించిన వారున్నారు. తమ జీవితంలో ఎదుర్కొన్న కష్టాల నుండి రాటు దేలి గొప్పవారిగా ఎదిగారు కొందరు . ఉత్తమ వ్యక్తిత్వం, విలువలు, నిజాయితీ, కష్టపడే మనస్తత్వం వల్లే తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించారు. అలాంటి వారి గురించి కవి దానా రాసిన రెండు పద్యాలు చదువుదాం.

అమితా బచ్చెన్ పొడవని/
తమచిత్రములందు నటన దర్శకులీరే! /
మమకారము వీడక; ఫలి /
తముకై యత్నములనెన్నొ తాగావించెన్/

పేదరికము తరిమిననూ /
పాదుగతనగానభావ పాటవ మెల్లన్ /
చేదుగ ఫలితాలున్నను /
పేదించిన "ఘంటసాల"వెలిగెను సుమ్మీ/ .

మొదట్లో తిరస్కారాలకు గురైనప్పటికీ తమ ప్రతిభతో, అద్భుతమైన ప్రావీణ్యంతో పేరుప్రఖ్యాతులు గడించారు అమితాబ్ బచ్చన్, ఘంటసాల వంటి వారు. తమ వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుకున్న మరి కొందరు ప్రముఖుల గురించి తెలుసుకుందాం.

1. బాల్యంలో మహాత్మా గాంధీ అబద్ధం ఆడేవారు. సత్యహరిశ్చంద్ర నాటకం చూసిన తరువాత ఆయనలో మార్పు వచ్చింది. సత్యం, అహింసలు జీవిత లక్ష్యాలుగా తీసుకున్నారు.
2. సాధారణ జీవితం గడిపి నిజాయితీకి పేరుపడ్డారు రెండో భారత ప్రధానమంత్రి **లాల్ బహాదూర్ శాస్త్రి.** వినయం, ధైర్యం, దేశభక్తిల కలయికయే ఆయన వ్యక్తిత్వం.
3. సాధారణ కుటుంబంలో పుట్టి, కృషి, వినయం, నిజాయితీ వల్లే "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా పేరుపొందారు మాజీ భారత రాష్ట్రపతి అబ్దుల్ కలాం. "డ్రీమ్ బిగ్ – వర్క్ హార్డ్" అన్న తత్త్వం ఆయన వ్యక్తిత్వం.
4. మానవ సేవకే జీవితాన్ని అంకితం చేశారు మదర్ థెరిసా. దరిద్రులు, అనారోగ్యంతో బాధపడే వారికి కరుణతో సహాయం చేసిన వ్యక్తిత్వం ఆమెకు ప్రపంచవ్యాప్తంగా గౌరవం తెచ్చింది.
5. అమెరికా 16వ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ పేదరికంలో పుట్టి, కృషి మరియు నిజాయితీ వల్ల అమెరికా అధ్యక్షుడయ్యారు. బానిసత్వం రద్దు చేసిన నాయకుడతను. నిజాయితీ, ధైర్యం, ప్రజల పట్ల మమకారం ఆయన వ్యక్తిత్వ లక్షణాలు.
6. అమెరికాలో నల్లజాతి హక్కుల కోసం అహింసా ఉద్యమం నడిపారు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్. మహాత్మా గాంధీ నుంచి ప్రేరణ పొందారు. ప్రసిద్ధి చెందిన "I Have a Dream" ప్రసంగం ద్వారా జాత్యహంకారాన్ని వ్యతిరేకించారు. నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారు. అహింస, ధైర్యం, సమానత్వం పట్ల అంకితభావం ఆయన వ్యక్తిత్వంలోని విశేషణాలు.
7. సినిమాల్లో రాముడు,కృష్ణుడు వంటి దేవుని పాత్రలు పోషించిన నందమూరి తారకరామారావు యొక్క వ్యక్తిత్వం, ఆశయం ప్రజలను ఆకట్టుకుంది. రాజకీయాల్లో ప్రవేశించి ప్రజల కోసం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన నిజాయితీ, ధైర్యం, ప్రజా ప్రేమతో కూడిన వ్యక్తిత్వం ఆయన విజయానికి మూలాధారాలయ్యాయి.

చక్కని వ్యక్తిత్వం కేవలం పేరు గడించడానికి మాత్రమే కాదు. చుట్టూ ఉన్నవారిని ప్రభావితం చేసి సమాజాన్ని మార్చడానికి శక్తిగా మారుతుందని నిరూపించిన వారున్నారు. సాహిత్యం మరియు కళా రంగాల్లో ఉన్నవారిలో మరి కొందరి గురించి తెలుసుకుందాం.

భారతదేశపు "గురుదేవ్" అని పిలవబడ్డ కవి, తత్త్వవేత్త, చిత్రకారుడు, సంగీతకారుడు. "గీతాంజలి" కవితా సంపుటి వల్ల 1913లో నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్న **రబీంద్రనాథ్ ఠాగూర్** ది సాదాసీదా స్వభావం. మానవతా దృష్టితో సాహిత్యం రాశారు. శాంతినికేతన్ విశ్వవిద్యాలయాన్ని స్థాపించి విద్యా రంగానికి సేవ చేశారు.

భౌతిక శాస్త్రవేత్త, "రామన్ ఎఫెక్ట్" కనుగొన్నందుకు 1930లో నోబెల్ బహుమతి అందుకున్న సి.వి.రామన్ ది, సరళమైన జీవనశైలి. విజ్ఞానపరమైన నిజాయితీలే ఆయన వ్యక్తిత్వానికి గుర్తింపు నిచ్చాయి.

టాటా సన్స్ మాజీ చైర్మన్ రతన్ టాటా యొక్క వినయం, దాతృత్వం ఆయన వ్యక్తిత్వానికి వన్నె తెచ్చాయి. కోటానుకోట్ల డబ్బును సామాజిక సేవ, విద్య, వైద్యానికి విరాళంగా ఇచ్చారు.

విప్రో కంపెనీ చైర్మన్, ఐటీ రంగంలో భారత దేశాన్ని ప్రపంచస్థాయికి చేర్చిన **అజీం ప్రేమ్‌జీ,** "అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్" ద్వారా విద్యా రంగంలో విపరీతంగా సేవలు చేసారు. తన సంపదలో ఎక్కువ భాగం దానం చేశారు. సింప్లిసిటీ, నిజాయితీ ఆయన వ్యక్తిత్వ లక్షణాలు.

ఈ మహనీయులందరిలో ఒకే ఒక సామాన్యమైన విషయం ఉంది . వారి విజయానికి మూలం జ్ఞానం లేదా డబ్బు కాదు. వారి వ్యక్తిత్వం మాత్రమే. వీరందరి జీవితాలు ఒకే సందేశం ఇస్తాయి. విజయం సాధించాలంటే జ్ఞానం, ప్రతిభతో పాటు చక్కని వ్యక్తిత్వం అవసరం.

అంతేకాదు. భారతీయ జీవన విధానంలో ఎంతో ప్రభావం చూపించే మన పురాణాలు కూడా గొప్ప వ్యక్తిత్వం ఉన్న మహానుభావుల గురించి వర్ణించాయి. తండ్రికిచ్చిన మాట కోసం ఆజన్మాంతం బ్రహ్మచర్యం

పాటించిన భీష్ముడు, సత్యం కోసం ఎన్నో కష్టాలు భరించిన హరిశ్చంద్రుడు, ప్రాణానికి అపాయమని తెలిసీ కవచకుండలాలు దానమిచ్చిన దానకర్ణుడు, తాతముత్తాతలకు విముక్తి కలిగించడం కోసం గంగను దివి నుండి భువికి తెచ్చిన భగీరథుడు మొదలైన వారంతా ఒక్కొక్కరూ ఒక్కో సద్గుణంతో మెరిసారు.

ఇక సంపూర్ణ వ్యక్తిత్వానికి ఉదాహరణ సాక్షాత్తు శ్రీరాముడు. 'రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః" అంది రామాయణం. 'ధర్మం మూర్తీభవిస్తే ఎలా ఉంటుందో అదే శ్రీరాముడు' అని శత్రువైన మారీచుడు చేత కీర్తించబడ్డాడు. రాముడిలో పదహారు సుగుణాలున్నాయి. సంతోషంగా ఉండటం, శౌర్యం కలిగి ఉండటం, నిర్దేశించిన ఆచారాలను నిశితంగా పాటించడం, ధర్మం ఆచరించడం, పరోపకారం చేయడం, కృతజ్ఞత చూపడం , అబద్ధాలు చెప్పకపోవడం, త్యాగశీలత కలిగి ఉండటం , గొప్ప సంకల్పం కలిగి ఉండటం, పేరుప్రఖ్యాతులు సంపాదించుకోవడం, మంచి పేరు కలిగి ఉండటం పట్ల కీర్తి, ఇతరుల మనస్సును నొప్పించకుండా రక్షించడం, మంచి నడవడిక (అనగా ఒకే మాట , ఒకే బాణం, ఒకే భార్య వంటి సద్గుణాలు), రూపంలో శారీరకంగా అందంగా ఉండటం, కష్ట సమయాల్లో ఓర్పు, సహనం కలిగి ఉండటం, శత్రువుల పట్ల కూడా దయ చూపడం , కోపానికి లోనవ్వకపోవడం. అలాంటి గొప్ప వ్యక్తిత్వం ఉన్నందువల్లే యుగయుగాలకి పూజలందుకుంటున్నాడు రాముడు. రామాలయం లేని గ్రామం ఉండదంటే అతిశయోక్తి కాదేమో. ఆయన చూపించిన లక్షణాల్లో కొన్నైనా అలవరచుకోవాలి నేటి తరం.

డబ్బు, హోదా, చదువుతో బాటు మంచి వ్యక్తిత్వం ఉన్న వారు ఎక్కడైనా గౌరవింప బడతారు. వ్యక్తిత్వం అనేది మనిషికి అత్యంత విలువైన ఆభరణం. దాన్ని నిర్మించుకోవడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. జీవితంలో విజయాలను సాధించడానికి కూడా వ్యక్తిత్వం ఎనలేని సహాయం చేస్తుంది. చదువులో ప్రావీణ్యం ఉన్నా, వినయమే లేకపోతే ఆ జ్ఞానం ఇతరులకు ఉపయోగపడదు. అందుకే విద్యతో పాటు గుణగణాలు కూడా పెంచుకోవాలి.

మనకు కలిగే పేరు, గౌరవం, ఆనందం అన్నీ వ్యక్తిత్వంపై ఆధారపడినవే. అందుకే మనం చిన్నప్పటి నుంచి మంచి అలవాట్లతో ఎదిగి, గొప్ప వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలి. నిజాయితీ, క్రమశిక్షణ, దయ, వినయం అనే నాలుగు స్తంభాలపై మన జీవితం నిలబెట్టుకుంటే, మనతో బాటు కుటుంబం, సమాజం, దేశం కూడా గర్వపడుతుంది.

వ్యక్తిత్వం అనేది రాత్రికి రాత్రే వచ్చేది కాదు. ఇది ప్రతి రోజూ చేసే పనులు, ఆలోచనల ద్వారా నెమ్మదిగా నిర్మితమవుతుంది. చిన్నప్పటి నుండి ఈ విషయాలను గుర్తు పెట్టుకుని ప్రవర్తిస్తే భవిష్యత్తులో గొప్ప వ్యక్తులుగా ఎదుగుతారు.

తనను తాను తొలుత తరచి చూచుకొనుట /
మరువరాదు సుమ్ము మనమునందు /
నిన్ను గాక నీకు దన్నుండువారేరి?/
నిన్ను నీవు పైకి నెట్టు కొనుము/

కలదు నీకు శక్తి కలదు నీకును యుక్తి /
కలదు సృజన చేయు గట్టి బలము /
స్వీయ కృషిని నెరపి చేయుచో సాధన/
లోక మందు మెప్పు నీకు దక్కు/

పనికిరావని నిన్ను పదిమంది దూషింప /
కోపపడక మనసు కుదుట పడుచు /
కార్య సాధనమున కండ్లుతెరచునట్లు /
చెయవలయు ప్రతిన ధ్యేయ మలర /

అని కవి దానా గారన్నట్టు 'బూడిదలో దాగి ఉన్న నిప్పు కణం లాంటిదే' మీలో దాగి ఉన్న అద్భుతమైన వ్యక్తిత్వం. దాన్ని వెలికి తీయడానికి మీరే కృషి చేయాలి. మీరు కేవలం మంచి విద్యార్థులుగా కాకుండా, మంచి మనుషులుగా కూడా ఎదగాలి. మీలో ఉన్న మంచిని పెంచుకుంటూ, మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరింత అందంగా మార్చండి. మీకూ , మీకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు , గురువులకు మంచి పేరు తీసుకురావాలి .

——*****--------